సాంకేతిక లోపం.. పనిచేయని యంత్రం

కియోస్క్ యంత్రాలు అటకెక్కాయి. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుంటే అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు రాయితీపై అందించేందుకు ఈ యంత్రం ఎంతో ఉపయోగపడింది. సాంకేతిక లోపం తలెత్తినా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడంతో ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. వ్యవసాయ సీజన్‌లో రైతులకు సకాలంలో ఎరువులు అందని పరిస్థితి.

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- సకాలంలో రైతులకు అందని సేవలు


నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం

రాయచోటి జగదాంబసెంటర్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ రైతులకు మేలు చేకూర్చే విధంగా అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతు ముంగిట అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంచింది. ఈ నేపథ్యంలోనే మండలంలోని అన్ని ఆర్బీకేలలో కియోస్క్ యంత్రాలు ఏర్పాటుచేయడంతో విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు రైతులు ముందస్తుగా ఆన్‌లైన్ చేసి వాటికి నగదు చెల్లించేవారు. మధ్యవర్తి ప్రమేయం లేకుండా నేరుగా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు చేతికందేవి. రైతు సేవా మిత్రల హాజరు, వాతావరణ సమాచారం. వాతావరణంలో మార్పులు వాటి ముందస్తు సమాచారం సైతం రైతు భరోసా కేంద్రాల ద్వారా తెలిసేవి. వాటి ఆధారంగా వ్యవసాయ సిబ్బంది రైతులను అప్రమత్తం చేసేవారు. రైతులు ఏ పంట వేయాలన్నా సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచి ఉండేది. ప్రస్తుతం ఆ యంత్రాలు నిరుపయోగంగా మారాయి.

పేరు మారింది.. సేవలు నిలిచాయి..

కూటమి ప్రభుత్వం మండలంలోని రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలు(ఆర్ఎస్‌కే)గా పేరు మార్చింది. పేరుకే మారాయి కానీ రైతులకు సేవలు అందజేయడంలో అధికారులు విఫలమయ్యారని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం సాంకేతిక లోపంతో కియోస్క్ యంత్రాలు పనిచేయడం లేదు. కొన్నిచోట్ల పూర్తిగా వాటిని విస్మరించడంతో మూలకు పెట్టేశారు. వచ్చే సీజన్‌లోనైనా వాటిని వాడకంలోకి తీసుకొచ్చి ప్రజాధనం నిరుపయోగంగా మారకుండా వ్యవసాయానికి చేయూత అందేలా చూడాలని, రైతులు కోరుకుంటున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సేవలు పునరుద్ధరించాలి



రైతులకు పూర్తి స్థాయిలో రైతు సేవా కేంద్రాల ద్వారా వ్యవసాయ సేవలు పునరుద్ధరించాలి. వ్యవసాయ యాప్‌ల గురించి అవగాహన కల్పించి, మారుతున్న కాలానుగుణంగా దిగుబడులు పెంచడానికి కృషి చేయాలి. ఆర్ఎస్‌కేలోని కియోస్క్ మెషిన్లు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలి.

– కొండూరు పెద్దరెడ్డయ్యరాజు, రైతు, రాయచోటి మండలం

మొబైల్ యాప్ ద్వారా సేవలు



కియోస్క్ ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువులు, విత్తనాలు వ్యవసాయ సిబ్బంది అందజేస్తున్నారు. రైతుల సౌలభ్యం కోసం సెల్ ఫోన్ యాప్ ద్వారా సేవలు అందిస్తున్నాం.

– నాగమణి, వ్యవసాయాధికారిణి, రామాపురం మండలం

క్లుప్తంగా

7న మండల సర్వసభ్య సమావేశం

పెనగలూరు: ఈ నెల 7వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని వారు కోరారు. తెలిపారు.

రూ.20 వేల విరాళం

సుండుపల్లె: మండలంలోని జరికిందపల్లిలో వెలసిన దండు మారెమ్మ దేవాలయం నిర్మాణానికి మాచిరెడ్డిగారిపల్లెకు చెందిన నంద్యాల వెంకటరమణ కుటుంబ సభ్యులు రూ.20 వేలు విరాళంగా అందజేశారు.

ఎంపీని కలిసిన నాయకులు


ఎంపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నరసింహారెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్: రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావుల నరసింహారెడ్డి హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుదీప్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వినాయక నగర్ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న చిన్నవెంగల్‌రెడ్డి

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీలోని వినాయక నగర్ అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవూరు చిన్న వెంగల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వినాయక ఆలయానికి రూ.5 లక్షల, 116లు ఇస్తానని ఆయన తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు


అలంకరణలో వేంకటేశ్వరుడు

రైల్వేకోడూరు: ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని టోల్‌గేట్ వద్ద నున్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు మణికంఠ శాస్త్రోకంగా స్వామికి పుజలు నిర్వహించిన అనంతరం భక్తులను ఆశ్వీరదించి ప్రసాద వితరణ చేశారు. మహాళా భక్తులు పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు.

భూముల వివరాలివ్వండి

సిద్దవటం: పెన్నానది ఒడ్డున పొరంబోకు భూముల వివరాలు తెలుపాలని ఏపీ దళిత వేదిక మండల అధ్యక్షులు బత్తల శివకుమార్ కోరారు. శనివారం సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 18, 2023న భూముల వివరాలు ఇవ్వాలని కోరామన్నారు. నది సమీపంలోని దాదాపు 20 గ్రామాల పరిధిలో భూముల వివరాలు ఎవరి స్వాధీనంలో ఉన్నాయో తెలుపాలని అడిగామన్నారు. ఈ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు పట్టాలివ్వమని కోరినట్లు తెలిపారు.

ఆంజనేయుడికి పూజలు



ఆంజనేయస్వామి

చిన్నమండెం: మండల కేంద్రంలో వెలసిన ఆంజనేయస్వామికి ర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆలయ మూలవిరాట్ మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం స్వామికి సింధూరపూజ జరిపారు.

పరామర్శ

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని వడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బరామయ్య శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి శనివారం పరామర్శించారు. సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

వైద్య శిబిరం


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గాలివీడు: మండలంలోని తూముకుంట గ్రామంలో అతెనా సోలార్ సంస్థ సహకారంతో ప్రేరణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు జితేష్, హెల్త్ సూపర్ వైజర్ గిరిధర్ ఆధ్వర్యంలో రక్తపోటు, చక్కెర, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అతెనా సోలార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ

తంబళ్లపల్లె: స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సిల్క్‌హబ్ ద్వారా మహిళలకు ఉచితంగా టైలరింగ్‌పై శిక్షణ ఇస్తారని స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య, టీఓ నాగరాజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 సంవత్సరాలు పైబడి 45 సంవత్సరాల లోపు మహిళలు అర్హులన్నారు. ఆసక్తి కలిగినవారు ఈనెల 15వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 9618655759లో సంప్రదించాలన్నారు.

స్కూల్‌గేమ్స్ పోటీలు

మదనపల్లె సిటీ: మదనపల్లె డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ భద్రయ్య తెలిపారు. 6న వాలీబాల్, బాడ్మింటన్,యోగా పోటీలు మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో, 7న కబడ్డీ, చెస్ సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో, 8న ఖోఖో మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు 10న మదనపల్లె డివిజన్ స్థాయి అథ్లెటిక్స్ మీట మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. ఎస్‌జీఎఫ్‌ఐ ప్రొఫార్మా-ఎ,మిడ్‌డే మీల్ ఫారమ్ తప్పని సరిగా తేవాలన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంపై చర్చ


మాట్లాడుతున్న ఎంపీడీవో అరుంధతి

రాయచోటి అర్బన్: మండలంలోని వివిధ గ్రామాలలో నెలకొన్న తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రాయచోటి మండల పరిషత్ సభా భవనంలో ఎంపీపీ పల్లపు రాజమ్మ అధ్యక్షతన శనివారంజరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చలు జరిగాయి. అందులో భాగంగా పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులతో గ్రామీణ ప్రాంతాల సమస్యలపై చర్చించారు. అవసరమైన చోట ఖచ్చితంగా నీటి ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రదీప్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో 24 చోట్ల ట్యాంకర్లతో నీటి సరఫరా జరుగుతోందన్నారు. ఎంపీడీవో పరిరపూర్ణ అరుంధతి మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా మంజూరైన భవనాలు ఊరికి దూరంగా ఉండడంతో నిరుపయోగంగా ఉన్నాయన్నారు. సిరికల్చర్ అధికారి సింధూజ మాట్లాడుతూ ఆ శాఖలో ఉన్న ప్రోత్సాహకాలను గురించి వివరించారు. ఉపాధి ఏపీవో రవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పశువులకు తాగునీటి సౌకర్యం కోసం తొట్లు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బి.రాంప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షులు సైకం జైపాల్‌రెడ్డి, పార్వతమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో జోరుగా అక్రమాలు


మాట్లాడుతున్న సిబ్యాల విజయభాస్కర్

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతోందని , కూటమి పాలనలో జోరుగా అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్ అన్నారు. రాయచోటిలో విలేకర్లతో శనివారం ఆయన మాట్లాడుతూ. తాగడానికి వాటర్, పాలు ప్యాకెట్లు దొరకని చోట కూడా కూటమి పాలనలో నకిలీ మద్యం దొరుకుతోందన్నారు. అన్నమయ్య జిల్లా మొలకలచెరువులో పోలీసులు కళ్లు చెదిరేలా టీడీపీ నేతల అక్రమ లిక్కర్ సామ్రాజాన్ని వెలికి తీశారని చెప్పారు. నకిలీ మద్యం తయారు చేయడంలో కూటమి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా ఎదిగిందన్నారు. అలాగే మట్టి, ఇసుక , భూ దోపిడీ విచ్చల విడిగా జరుగుతోందన్నారు. ఈ విధంగా వేల కోట్ల రూపాయలు కూటమి నేతలు దోచుకుంటున్నారని పేర్కొన్నారు. కల్తీ మద్యం వల్లతో ఆరోగ్యం రోజు రోజుకూ క్షీణించి పోతోందని గుర్తుచేశారు. దీనికి తోడు 9వ తరగతి చదువుతున్న గిరిజన బాలికపై అత్యాచారం చేసిన ఇద్దరు యువకులపై చర్యలు తీసుకునేందుకు పాలకులు వెనుకడుగు వేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు చంద్రనాయక్, సర్పంచ్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి గ్రామోత్సవం


సాయినగర్‌లో దుర్గాదేవి అమ్మవారి ఊరేగింపు

సిద్దవటం: మండలంలోని ఉప్పరపల్లిలో పీఆర్‌బీ అధినేత పుత్తా రామభద్రయ్య కుమారుడు పుత్తా బాబు ఆధ్వర్యంలో శనివారం దుర్గాదేవి అమ్మవారి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉప్పరపల్లి పంచాయతీ సాయినగర్‌లోని భద్రావతి భావనారాయణస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. చివరి రోజున దుర్గాదేవి అమ్మవారి విగ్రహాన్ని అలంకరించి పురవీధుల గుండా ఊరేగించారు. అమ్మవారి విగ్రహం నివాస గృహాల వద్దకు రాగానే గృహిణులు అమ్మవారికి కాయ కర్పూరాలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఊరేగింపులో భాగంగా మహిళలు కోలాటం ప్రదర్శన చూపరులను ఎంతగానో అలరించింది. భజన చేస్తూ, బాణసంచా పేలుస్తూ మంగళవాయిద్యాల మధ్య అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, యువత పాల్గొన్నారు.

టమాట జ్యూస్ ఫ్యాక్టరీ కోసం కృషి చేస్తా


మాట్లాడుతున్న చైర్మన్ రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి టౌన్: రాయచోటి మార్కెట్ యార్డులో టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రాయచోటి మార్కెట్ యార్డు పాలక వర్గ సభ్యులతో శనివారం తొలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటిలో టమాట పంటపై ఆధారపడిన రైతులను ఆదుకోవడానికి జ్యూస్ ఫ్యాక్టరీ అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మట్లి శ్రీనివాసులునాయుడు, కోటకొండ రఘునాథ, మారుతీ శంకర్, వెంకట్నాగులు, సుజాత, రామతులసి, సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల కోసం గ్రీవెన్స్ నిర్వహించాలి


కలెక్టర్‌ను కలిసిన నాయకులు

రాయచోటి టౌన్: ఎస్సీ, ఎస్టీల కోసం నెలలో ఒక రోజు గ్రీవెన్స్ నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బండకింద మనోహర్, సత్యాల రామకృష్ణ, జి.వెంకటరమణ కోరారు. కలెక్టర్‌ను శనివారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం నెలలో ఒక రోజు గ్రీవెన్స్ నిర్వహించాలని, అప్పుడే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పరిష్కరించబడతాయన్నారు. పౌర హక్కుల దినోత్సవం, సివిల్ రైట్స్ దినోత్సవాలను నిర్వహించడం లేదని ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ఈ నెల 8న నిర్వహించే సమావేశంలో చర్చించి అధికారులకు ఆదేశాలిస్తానని చెప్పినట్లు వారు తెలిపారు.

రాయితీపై బొప్పాయి విత్తనాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌చంద్రశేఖర్

రైల్వేకోడూరు అర్బన్: ప్రభుత్వం బొప్పాయి విత్తనాలను రైతులకు 50 శాతం రాయితీతో సరఫరా చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ బొప్పాయి రైతులకు తైవాన్ రెడ్ లేడీ విత్తనాలుఉద్యానశాఖ ద్వారాసరఫరా చేయాలని డిమాండ్ చేశారు. దళారులు ఇస్తున్న నకిలీ విత్తనాలతో రైతుల నష్టపోయే ప్రమాదముందని చెప్పారు. కొందరు వ్యాపారులు అధిక ధరలకు మొక్కలు అమ్మాలని ప్రయత్నిస్తున్నారని, దానిని నియంత్రించాలని పేర్కొన్నారు.

శుద్ధజల యంత్రం.. నిరూపయోగం



పనిచేయని ఏపీఎండీసీ వాటర్ ప్లాంట్

ఓబులవారిపల్లె: శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. వైకోట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం సమీపంలో ఏపీఎండీసీ టీఆర్ఎస్ నిధులతో వాటర్ ప్లాంట్ గతంలో ఏర్పాటు చేశారు. మరమ్మతులకు గురై చాలా రోజులుగా ఇది పనిచేయడం లేదు. ఏపీఎండీసీ అధికారులు పట్టించుకోక పోవడంతో ఇలా వృథాగా ఉంది. వెంటనే మరమ్మతులు చేయించాలని వైకోట గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ


నివాళులర్పిస్తున్న ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

నందలూరు: మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ముమ్మడిశెట్టి చంద్ర సతీమణి లక్ష్మీదేవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి మృతురాలి పార్థివ దేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బొబ్బిళ్ల త్రినాథ్, గుండు మల్లికార్జునరెడ్డి, ఆకెపాటి జగదీశ్వర్‌రెడ్డి, అక్కిరెడ్డి మోహన్‌రెడ్డి, కసిరెడ్డి నరసింహారెడ్డి, బుసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, విజయుడు, మధురాజు, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

ఓబులవారిపల్లె: మండలంలోని మంగంపేట ఏపీఎండీసీ పాఠశాలలో పని చేస్తూ శుక్రవారం అకస్మాత్తుగా మృతి చెందిన పసుపులేటి రవితేజ కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు శనివారం ఆ పాఠశాల ఎదుట నిరసన చేపట్టారు. పని ఒత్తిడి కారణంగా రవితేజ మృతి చెందాడని, భార్య పిల్లలు, కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం, భార్యకు ఉద్యోగం, పిల్లలకు ఏపీఎండీసీ స్కూల్‌లో ఉచితంగా చదువు చెప్పించాలని వారు డిమాండ్ చేశారు. ఏపీఎండీసీ ప్రతినిధులు స్పష్టమైన హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

యల్లమ్మ తల్లీ..చల్లగ చూడమ్మా


కమిటీ సభ్యులతో నిసార్‌అహ్మద్


మదనపల్లె రూరల్: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని జగన్ కాలనీలోని యల్లమ్మ ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజల్లో నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పాల్గొన్నారు. శనివారం జగన్‌కాలనీ యల్లమ్మ ఆలయానికి వచ్చిన నిసార్ అహ్మద్‌కు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు సాదరంగా స్వాగతం పలికారు. ఆలయంలో యల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ...కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి యల్లమ్మ తల్లిని, నియోజకవర్గంలోని ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో సమృద్ధిగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో నాయకులు బయ్యారెడ్డి, విజయ్ భాస్కర్, ఎస్.శంకర్‌రెడ్డి, నగేష్, బి.రమణ, శివశంకర్, రాము, లక్ష్మీపతి, రెడ్డిశేఖర్, వీరాంజనేయనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నారసింహుడికి ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో స్వామివార్లకు విశేషపూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో తరిగొండ ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ గావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని శ్రీ నృసింహస్వామి ఆలయంలో వేకువజామేన ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివార్లను సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయఅర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి నిమజ్జనం


దుర్గాదేవిని నిమజ్జనానికి తీసుకెళుతున్న దృశ్యం

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో శ్రీదుర్గాదేవి నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని దళితవాడలో తొలిసారిగా దసరా ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్టించారు. పదిరోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శనివారం అమ్మవారిని అందంగా అలంకరించిన వాహనంలో కొలువుదీర్చారు. మేళతాళాలు, పెద్ద ఎత్తున బాణసంచా పేల్చుతూ అమ్మవారిని గ్రామపురవీధుల గుండా ఊరేగించారు. దుర్గామాతకు జై అంటూ అనే నినాదాలతో పట్టణం హోరెత్తింది. సాయంకాలం గ్రామానికి సమీపంలోని చెరువులో ఘనంగా నిమజ్జనం గావించారు.